ఎక్సురే ౪ం

# కావాలి

"విహారి"

కావాలి అన్నివిధాలా, అందరికంటె, అన్నివిషయాల్లోనూ యెబిలిటీ — స్వాస్థ్యాలుగల వరుడికి, జాతకంప్రకారం యిరవై యేడేళ్ళుదాటని వరుడికి కావాలి వధువు. ఈ కాలంలో వయస్సు కాసంత యెక్కువని నవీనులకు తోచవచ్చు. కాని, నలభై యేళ్ళవరకూ బ్రహ్మచర్యం పాలించా అని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి కాబట్టి ఆ దృష్టితో దీన్ని చూస్తే అనుమానించాల్సిన అగత్యం వుండదు

పేపర్లలో స్థలం చాలా ప్రియంగా వుంటంవల్లనూ, అదికూడా డీటెయిల్డుగా పాయింట్సు అన్నీ యివ్వడానికి వీలుగా వుండదుకనుకనూ, కాగితాలు చిచ్చు ప్రియంగా వుండే యీ రోజుల్లో అనవసర కరస్పాండెన్సు పెంచడం మాకు యేమాత్రం ధర్మంకాదని తోచడంవల్లనూ, యిలా కేరాఫులతోనూ, పోష్టుబాక్సులతోనూ పనిలేకుండా సమస్తవిషయాలూ విడమర్చినట్లుగా వివరిస్తున్నాం ఇలా వివరించడానికి ఉత్తర ప్రత్యుత్తరాలు రహస్యంగా వుంచాల్సిన అగత్యం యేమాత్రమూ లేకపోవడమూకూడా వొహ కారణమే! నిమ్నలిఖిత యోగ్యతలు గల కన్యలయొక్క ఎల్డర్సు స్వయంగాకాని, వధ్వాసహ వచ్చిగాని, పెళ్ళికొడుకును చూచి వెళ్ళవొచ్చును లేకపోతే రెండు ఛార్జీలూ, పై ఖర్చులూ ముందుగా పంపితే వరుడే రాగలడు. వరుణ్ణి చూడాల్సిన అవసరం పిల్లవేపువాళ్ళకి యెంత అవసరమో పెళ్లికొడుకివేపువాళ్ళకికూడా అంత అవసరమనే సంగతి వేరే రాయడం అనవసరం

పేరు నూతనపక్కీలో జి యణ ఆర్ పరాయితం వయస్సు సంగతి ఆల్ రెడీ మనవిచేశాం ఎత్తు 5 అడుగుల నాలుగు అంగుళాలు పాటిమనిషి. రంగు చామన ఛాయ మొహంమీద స్ఫోటకం మచ్చలున్నాయి కాని అంతమాత్రంతో చెడిపోయింది యేమీలేదు. ఇహమీద స్ఫోటకం యితణ్ణి ఆశించదనీ, బాడీ అంతా స్ఫోటకం ప్రూఫ్ అయిపోయిందనీ తెలియాలి శరీరం పుష్టం ఇంతవరకూ యేమాత్రమూ చెడలా. నవనాగరకతా ప్రపంచం అన్నిటికంటె ముఖ్యంగా కోరే క్రాపుంది కనబడీ కనబడని సన్న పోచజుత్తుగూడా వెనకాలా వుంది. కాబట్టి సనాతనులుకూడా శంకించ వలసిన పన్లేదు మీసాలూ, చెవులపోగులూ వీట్నిగురించి వ్రాయడం అవసరంలేదు అవి వధువుతరపువాళ్ళ అభిరుచుల్నిపట్టి మార్చుకోడానికి సిద్ధం

పిల్లవాడికి విద్యాగంధం బాగావుంది సెకండుఫారం చదువుతూ వ్యక్తి కలగంగానే ఫారిన్ లాంగ్వేజి అని యింగిలీషు మానేసినా, మాట్లాడే మాటల్లో తొంభై పరసెంటు యింగ్లీషు మిశ్రమం ఇది పెద్దపెద్ద పట్టభద్రులగ్గూడా పట్టుబడని విషయం ఇతర వొకటి రెండు మన ప్రాంతీయ భాషల్లో మాంచి ప్రవేశంవుంది ఇతని సాహిత్య జ్ఞానానికి సాధారణులు ఆదుకోలేరు ముసర్జీ వ్రాతలో కలం విరిగిపోతుంది లోకజ్ఞానం అచుంబితం కోర్టువ్యవహారాల్లో కొట్టిన పిండి. పరపార్టీ భయంకర అనే సార్థకనామం వొచ్చేసింది అయాచితంగా యింత చిన్న వయసులోనే పట్టాలేకపోవడం వొహటే లోపం. ఎంతపాటి ఘట్టాన్నయినా విడదీసి చెబుతుంటే వినేతీరాలి. ఆ అన్వయ ఫక్కీ పేరు ఎదట పడితే పండితుడిగ్గూడా ముక్కుపట్టిస్తాడు సంగీతకళ యితని సొత్తు. తరంగం యెత్తుకుంటే మద్దెలవాడు గద్దల పాలైపోతాడన్నమాటే! ఆంధ్రుడు కాబట్టి రేడియోలో యింతవరకూ ప్రవేశం కలక్కపోవడమే చింతనీయం. ఇలా వొక్కో విషయం యెత్తుకొని వ్రాయాలంటే చాట భారతం ఔతుంది కాబట్టి ముక్తసరిగా మూడు మాటల్లో చెప్పేస్తాను. వైద్యంలో అంత లావు చెయ్యి మరిలేదు. శిల్పంలో పోటీచెప్పాలంటే ఆయిదారు శతాబ్దాలు వెన్నక్కి వెళ్ళాలి

గోత్రసూత్రాలు సర్వోచ్చమైనవి ఏకాక్షయం. ఆయుర్వేదం వీరి పితామహుడు ఊషరక్షేత్రమహాసంగ్రామంలో స్వర్గాన్ని అలంకరించాడు. తండ్రి హెడుకనిష్టేబుగా వున్నా పదివేలవరకూ బాగా సంపాయించి పెట్టి పొయ్యాడు తల్లి బహుపతివ్రత అనే మాట ఆబాలగోపాలానికీ తెలుసు ఇహ చెప్పేదేముంది? వంశం అతిపవిత్రమైంది. వంశవృక్షం తీసిచూస్తే పైనుంచి కింది వరకూ అందరూ కవులే—అందరూ పండిత పుత్రులే — అందరూ పూజ్యులే మరిచిపొయ్యా ఆచారం శుభాల్లో శైవం, అశుభాల్లో వైష్ణవం ఇదికూడా సలహానుబట్టి మార్చుకోవడానికి యెలాంటి ఆక్షేపణాలేదు

ఇహ స్వాస్థ్యం సంగతి వూళ్ళో వో పక్కా యిల్లుంది పెంకువేసింది. వున్న భూవసతంతా గ్రామానికి ఉత్తరభాగంలో వుంది. దాంట్లో సాలుకు మంచి రాబడుంది. ఒహ యీతచెట్లమీదనే బోలెడంత వస్తుంది. బ్యాంకిలో డబ్బుంది వొడ్డీలమీద రూపాయలు తిరుగుతుంటాయి

ఇవన్నీ యిలా వుండగా వూళ్ళో యెన్నో గౌరవోద్యోగాలున్నాయి. మచ్చుకి రెండు అభినవాంధ్ర గ్రామనాటక సమాజానికి అగ్రాసనాధిపతి పురోవృద్ధి సంఘానికి కార్యదర్శి. ఈ సంఘసందర్భాల్లోనూ యితర ప్రయివేటు వ్యవహారాల్లోనూ వచ్చివెళుతుండేవాళ్ళకి విధీ—విరగడా వుండదు

యింట్లో వో ముసలితల్లుంది కాబట్టి గృహవిషయంలో యేలాటి తొందర్లూ వుండవు యింటబడ్డ వధువు అన్నివిధాలా సుఖపడుతుందని గ్యారంటీగా చెప్పగలం, ఆలాంటి భాగ్యశాలి యెక్కడ జన్మించివుందో తెలియందలా.

తాజాకలం.—గోత్రం గార్గేయం

## నాటకం — బూటకం

లోకమంతా నాటకం !
సంఘమంతా బూటకం !

మేనిపై వీబూదిగీతలు
మెళ్ళొ తులసీమాల వేసుక
ఆసనంబులవేసి తపముల
నాచరించుట నాటకం

మగడు బోయినతెల్లవారే
మంగలిని బిలిపించి నెత్తిని
బోడిగాజేయించి వాంఛల
వీడజేయుట నాటకం

రాతిబొమ్మకు బొట్టుబెట్టి
రంగు రంగుల బట్టగట్టి
దేవిగా పూజించి, మోక్షము
దేవులాడుట నాటకం

ఇంటిలోపల కల్లుకుండల
నొంటిగాకాజేసి, భార్యల
లేనితప్పుల జూపి మైబగు
లంగబాదుట బూటకం

దేవికొరకై లోకులెల్లరు
దెచ్చుకాన్కల పొట్టబెట్టుక
దొంగమాటల నాడిలోకుల
దోచుకొనడం బూటకం.

మేడిపండున పురుగులుండవె?
బోడితలలో తలుపులుండవె?
నరులలోపల మోసముండదె?

నాటకంలో బూటకం !!

—తాళ్ళూరి రామానుజస్వామి,

యింక వధువు సరగతి 12 నుంచి 16 లోగా వుండొచ్చు వయస్సు. 4 గోఫార మొదలు 6 పారంవరకు చదువుండాలి. కనీసం ఫిడేలూ, వీణా తెలిసుండాలి గాత్రం శుద్ధంగావుండాలి. మాంచితలకట్టూ, చక్కని రూపం అవసరం. సైకిలింగు తెలిసుండాలి వివాహంలో నిర్ణయించుకోపొయ్యే మర్యాదలు అక్షరాలా జరిగితీరాలి. ఫోటోలు అంగీకరింపబడవు

పరిశిష్టం వధువువేపు వాళ్ళకి పిల్లవాడి వయస్సులోనూ, యిన్నన్నా యీకాలంలో ముఖ్యంగా యెన్నదగ్గ వుద్యోగము లేని విషయంలోనూ కొసంత అసంతృప్తి కలుగుతుండేమోగాని, దాన్నిగుర్చి అలా అనుకోవలసినపనిలేదు పిల్లవాణ్ణిచూస్తే ఆ అనుమానంవుండదు యిహ వుద్యోగం విషయం మిగిలింది, యిదివర్లో రెండుమూడు వుద్యోగాలుచేసి, (అంటే తొమ్మిదంగుళాల స్టీలు గొట్టాల ఫాక్టరీలోనూ, దిగ్రేట్ యిండియన్ సుద్దఫాక్టరీలోను అన్నమాట) పేరూ ప్రఖ్యాతీ గణించాడు చివరికి యెంతైనా నౌకరేగదాని స్వబుధ్యామనస్సు స్థిమితంగా వున్నప్పుడే మానుకున్నాడు అబ్బాయికి నవ్వినప్పుడు మొఖంమీదపడే ముడతలవల్లా హస్త సాముద్రికంవల్లా శతాయుష్మంతుడున్నూ అష్టపుత్ర బహు ధనవంతుడున్నూ ఔతాడని యిదివరకే తేలిపోయింది యిహ జాతకరీత్యా కూడా పై విషయాలు బలపడుతున్నాయి జాతకం ఫ్రీ ఆన్ ఆప్లికేషన్ ఎన్క్లోస్ స్టాంపు్స వర్త్ ఆఫ్ అనాస్ ఫోర్ ఫర్ పోస్టేజ్

మన్లోమాట —మేమంటే మేమని యిప్పటికే యెంతమందో వచ్చి పోతున్నారు "ఆలస్యం అమృతం విషం" కాబట్టి అదృష్టవంతులు త్వరపడాలి, ఆలసించిన ఆశాభంగం" యిలా మనసులో చదివి కాగితం సత్రం అరుగుమీద పడేశా. వరుడు—అంటె పైన వుదహరింపబడ్డ పెండ్లికొడుకు చట్ మని దాన్నితీసి మడిచి జేబులో పెట్టుకుంటూ "యావంటాడు" అన్నాడు

నేను గంభీరంగానే "బాగావుంది" అన్నా

"యీ మసోదా మానేస్తం చిన్నబ్బి రాసిచ్చాడండీ తమలాంటి తెలిసినవారికి నలుగురికి చూపి, సరేనన్నాక పేపరుకి యెంతైనాసరే పంపిద్దామనుకున్నానండీ, యీ రహస్యం పేపర్లోకియెక్కేవరకూ యెవ్వరికీ చెప్పదల్చుకోలా యావంటారు? యిలాయితే మంచికన్య - తప్పక లభిస్తుందన్నాడు చిన్నబ్బి" అన్నాడు మందహాసంచేస్తూ. యీ విషయంలో యేం సలహాయివ్వాలో నాకుతోచలా వో రొండునిమిషాలాలోచించి "యెదుకులెండి మీ బంధువుల్లో—తెలిసిన పాగీ పిల్లలుంటే ప్రయత్నించక పొయ్యారాన్నా. దాని కాయన మొహం మాడ్చుకుంటూ "వున్నారు వుంటానికి దేబెమొహంవాళ్ళు కాని నాకు వొహళ్ళైనా నచ్చలా. యింటావిడాంటే అప్సరసలా వుండాలని నామతం" అన్నాడు

నిజం చెప్పాలనుకున్నా "మీయిష్టం యేమైనా అనుకోండి. నాకు తోచినమట్టుకి యిది బాగా కనపడ్డంలా. యిదికొత్త వేళాకోళం వ్యవహారంగా వుండేలావుంది. యీ పద్ధతిమానేసి, నిజంగా చేతులోపైసావుంటే పాలఘాటుమార్గం పట్టడం పరమసమ్మతం అదైతే చీకూ చింతావుండదు" అన్నా దానికాయన చురుకు చురుకున చూస్తూ లేచి నిలబడ్డాడు "బాగావుందండీ మీ సలహా నేనేం తిక్కవాణ్ణనుకున్నారాయేం ? యిలాటి అపమార్గాలకీ నాకూ చాలాదూరం నేను ఘరానాగల ఖచ్చితమైన మనిషిని. మా చిన్నబ్బికంటే నామేలు కోరేవారు మరిలేరు. తమకి పదివేల నమస్కారాలు. దయచెయ్యండి" అంటూ వెనక్కి చూడకుండానే బిర బిర బుర్రతిప్పుకుంటూ సత్రంలోకి దూరాడు ఆ పెళ్ళికొడుకు.